రోజూ వెళ్లే దారిగుండానే రిక్షా నెమ్మదిగా సాగిపోతోంది. అదిగో అక్కడే — ఆ తురాయి చెట్ల దగ్గరికే నా ప్రాణం పారిపోతానంటుంది. ఎంత అందం తురాయి
పూలు! ఒక్క ఆకునూ మిగల్చకుండా చెట్టంతా పువ్వులే! మిషనరీ స్కూల్లో చదివేప్పుడు చర్చి పక్కనే ఈ చెట్లు — చర్చి బయట రాలిపోయిన వేప పళ్ళనూ, కర్రతో కొట్టి తురాయి పువ్వులనూ రాల్చి చప్పరించేవాళ్ళం. ఎంతటి సామాన్య జీవితాలవి — ఆనందమే ఆనందం — వెన్నెలే వెన్నెల!

తురాయి చెట్ల మధ్య నుంచీ సమాధులు కనబడుతున్నై. ఎంత అదృష్టం! ఇంత అందం మధ్యన పడుకున్నారే వల్లగా—

ఎండమండిపోతోంది — రిక్షా నెమ్మదిగా సాగుతోంది. రిక్షా వాడి శరీరం మీది చెమట బిందువులు బరువుగా తయారై నేలకిగా జారుతున్నై.

సాయ్... సప్పాయ్... జాయ్ ధనాధన్ ధన్...ధన్. ట్రక్కు రిక్షాని తొక్కేసింది. నేను దొర్లుకుంటూ ట్రక్కు టైర్ల కింద పడ్డాను.

ఇప్పుడు నా నివాసం తురాయి చెట్ల మధ్యకు వచ్చి చేరింది. సమాధిలో నన్ను పెట్టారు కానీ, నేనక్కడ లేను — పైనే తిరుగుతున్నాను. నా ఒంటిమీద బట్టలు లేవు — తురాయి పూలే తీసి గుండెలు కప్పుకుంటున్నాను. తురాయి ఆకులు నడుంకి చుట్టుకున్నాను. ఎంత చక్కగా వుంది. వర్ణించలేని తనివి! నా కళ్ళు సగమే తెరిచి వున్నాయి.


అరె, ఎవరో వస్తున్నారే — ఈ సిమెంటే గేటు తీసుకు లోపలకు వస్తున్నారే — ఎవరతను, చిన్నవాడే — అతను నడుస్తుంటే స్త్రీత్వమంతా దోసిళ్ళతో

## తురాయి పూలు

అతని పాదాలమీద కుమ్మరించాల్నుందే — ఆచ్ఛాదన లేని నా శరీర భాగాలు అతన్ని చూసి పులకించాయనుకున్నాను. నా ఒంటికేసి చూసుకోబోతే ఒంటి ఒంపులు మీద ఆలివ్ గ్రీన్ గార్డెన్ శారీ మెరుస్తోంది. గాలిలో తేలిపోతూ అతన్ని సమీపించాను.

టక్కుమని రిక్షా టాపుకి నా తల కొట్టుకుంది. అదిరిపడి చూసేసరికి ఇల్లు ఎదురుగుండా వుంది. ఆలివ్ గ్రీన్ గార్డెన్ శారీ కుచ్చెళ్ళు సవరించుకుంటూ ముప్పై అయిదేళ్ళొచ్చినా పెళ్లికాని నేను క్రిందికి దిగాను!!

—'జెయవ్'



## ప్రధానమంత్రికి బహిరంగ లేఖ

## తిట్టడమే పనా?

గౌరవనీయులైన ప్రధాన మంత్రిగారికి,

'ఆంధ్రజ్యోతి' పత్రిక ద్వారా మీ పరిపాలను గురించి కొన్ని విషయాలను నిర్మొహమాటంగా వ్రాసే అవకాశం కలిగినందుకు ఓ పక్క సంతోషమ , మరో పక్క బాధగానూ వున్నది. ఇన్నాళ్ళకు ఈ విషయం మీద అభిప్రాయాలను వ్యక్తపరిచే ఓ వేదిక దొరికినందుకు సంతోషమూ, అభిప్రాయాలలో చాలావరకూ మీకు ఇబ్బంది కలిగించేవే వుండబోతున్నందున ఓ విధమైన బాధ కలుగుతున్నాయి. క్లుప్తంగా విషయాన్ని వివరిస్తాను.

1984 అక్టోబరులో ఆ ఘోర హత్య తరువాత దేశం ఎటు పోతున్నది? అన్న భయమూ, ఆందోళనల్లో ప్రజలు సతమతమవుతున్నప్పుడు చీకట్లో చిరుదీపంలా ఈ దేశ రాజకీయ రంగంపై మీ ఆరంగేట్రం జరిగింది. పదవులపైనా, పదవీ రాజకీయాలపైనా మీ విరాసక్తత, ముక్కుకు సూటిగా మాట్లాడే మీ మృదు భాషణము, శత్రువును సైతం నిర్వీర్యపరచగల అమాయకమైన మీ చిరునవ్వు, నిష్కపటమైన మీ గత జీవితమూ, "మేమిద్దరం -మాకిద్దరూ"లా వుండే సరళమైన కుటుంబ జీవిత విధానమూ, మీరు ప్రధానియైన తొలి నాళ్ళలో ప్రజల్ని ముగ్ధుల్ని చేసిన కొన్ని అంశాలు. మీ పరిపాలనా విధానాలు, మంత్రివర్గ నిర్మాణమూ, 21వ శతాబ్దంలోకి ప్రజల్ని తీసుకువెళ్ళాలన్న పురోగమన ఆలోచనా పద్ధతులు, ఆధునీకరణపై మీ ఆసక్తి, పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ అవినీతిని ప్రక్షాళన చేస్తానన్న మీ నినాదాలు, చట్టాలు ప్రజలకు ఓ కొత్త ఉత్సాహాన్ని కలిగించాయి. మీ హయాంలో ఈ దేశానికి ఉజ్వల భవిష్యత్తు వుండబోతున్నదన్న భరోసాను కలిగించాయి. ఆ రోజులలోనే మీరు జరిపిన విదేశ పర్యటనలు, అక్కడి విలేకరుల సమావేశాలలో మీరు ప్రదర్శించిన చతురత, వివిధ దేశ నాయకులను కలుపుకు రాగలగడంలో మీ రాజనీతిజ్ఞత ఎంతో ఉజ్వలంగా భాసించాయి.

అలా దాదాపు రెండు సంవత్సరాల "హనీమూన్" తరువాత క్రమేపీ మీ పాలనా యంత్రాంగం బీటలు వారడం ప్రారంభించింది. అప్పటి జైల్ సింగ్ గారితో మీ అనవసరపు వివాదాలు, స్నేహితులూ, వంది మాగధులూ చేసే తప్పులలో తెలిసీ తెలియకా మీరు ఇరుక్కోవలసిరావడం, పైగా ఆ తప్పుల్ని ఒప్పులుగా సమర్థించబోవడంలో నోరు జారవలసిరావడం, గోటితో పోగొట్టుకొనవలసిన అభిప్రాయ భేదాల్ని గొడ్డలి వరకు తెచ్చుకుని, ప్రజలచేత "ఛీ"ననిపించుకున్న మంత్రుల్ని, నాయకుల్ని అవమానించడం, అవమానించడంలో మీ పతన దశ ప్రారంభమైనదని చెప్పవచ్చును. ప్రసిద్ధ లాయరు రామ్‌జెత్మలానీతో మీ అనవసరపు వాగ్యుద్ధమూ, ప్రజలలో అంతో ఇంతో పేరున్న నాయకులు జ్యోతిబసు, హెగ్డే మొదలైన వారిమీద మీ విసుర్లూ మీ ప్రతిష్ఠకు భంగం కలిగించడం మొదలుపెట్టాయి. ఇందిరా గాంధీ హత్య కేసులో "బెనిఫిట్ ఆఫ్ డౌటు" కింద కేహార్‌సింగ్‌ని ఉరితీయకుండా వుండినట్లయితే పంజాబు ప్రజలలో మీ పట్ల సానుభూతి పెరిగి వుండేది.

ఢిల్లీ అల్లర్లలో అష్టకష్టాలపాలయిన సిక్కు కుటుంబాల అభ్యర్థన ననుసరించి న్యాయ విచారణ జరిపించి వుండవలసింది. ఓ పక్క లక్ష మందికి పైగా రైతులు టిక్కాయత్ నాయకత్వంలో ఢిల్లీలో బైఠాయించి వున్నప్పుడు వాళ్ళని వదలి మరో లక్ష మంది 'కార్యకర్తలను' డబ్బులిచ్చి పిలిపించి ఎర్రకోట దగ్గర 'ఇందిరా సంస్మరణ దినం' జరుపుకోవడం ఎంత మూర్ఖత్వమో ఆలోచించారా? దానివలన నగరవాసులకు ఇబ్బంది, రైతులతో నేరుగా మాట్లాడే అమూల్య అవకాశాన్ని మీరు పోగొట్టుకున్నట్టు అవడమూ తప్పితే ఏం ఒరిగింది?

మీరు ప్రధాని అయిన తర్వాత జరిగిన ఎన్నికలు దేనిలోనూ మీరు గెలవలేదన్నది సత్యమే కదా? అలా ఎందుకు జరగవలసివచ్చిందో ఎప్పుడైనా ఆత్మ పరిశీలన చేసుకున్నారా? "ప్రభుత్వ మీడియా"లలో మీ గురించిన "ఓవర్-ఎక్స్‌పోజరూ", ప్రతిపక్షాలను తిట్టిపోయడమే ఎన్నికల ప్రచారము అనుకున్న మీ అజ్ఞానమే అందుకు కారణాలని గ్రహించారా?

ఇక చివరగా ఓ విన్నపం. ఇప్పటికీ ప్రజలు మీ వైపే ఆశగా చూస్తున్నారు. రకరకాల గత చరిత్రలతో నిండి వున్న నాయకులు కలిగిన కంగారుగంప పార్టీల కంటె నిజాయితీ వున్న నాయకుడు కలిగిన ఒక్క పార్టీ పరిపాలనే మంచిదన్న ఆలోచనలోనే ఎక్కువ శాతం ప్రజలు ఇప్పుడూ వున్నట్టు తెలుస్తున్నది. కాబట్టి ఇప్పటికైనా మేలుకోండి.

వేరే ఛాయిస్ లేదు కాబట్టి,మిమ్మల్ని ఎన్నుకోవలసివస్తున్నదన్న ప్రజాభిప్రాయాన్ని మార్చేందుకు గట్టి ప్రయత్నాలు ఆరంభించండి. సరైన నాయకుడు లేక అస్తవ్యస్తమైపోతున్న ఈ దేశానికి చేయందించండి. "ఆల్ ది బెస్ట్!"

— డాక్టర్. బి.సుధాకర్, చెంగన చెర్రి